I

సాక్షి సంగారెడ్డి

శుక్రవారం । 11 । అక్టోబర్ । 2024





సంగారెడ్డి మహబూబ్ సాగర్ చెరువు కట్టపై బతుకమ్మలతో వస్తున్న మహిళలు

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి ఉత్సవాలు



శ్రీ దుర్గాదేవి అలంకరణలో దుర్గామాత

ఝరాసంగం(జహీరాబాద్): శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయంలో దుర్గామాత ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గురువారం శ్రీ దుర్గాదేవిగా దుర్గామాత దర్శనమిచ్చారు. అమ్మవారికి పసుపు కుంకుమలతో విశేష అలంకరణ, విఘ్నేశ్వర పూజ, చతుష్టి సహిత ఆభరణార్చనలు, లలిత హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ క్రాంతి

పుల్‌కల్(అందోల్): ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం కలెక్టర్ వల్లూరు క్రాంతి స్థల పరిశీలన చేశారు. గురువారం మండలంలోని బస్వాపూర్ శివారులో ఉన్న స్థలం అనువైనదిగా గుర్తించారు. కలెక్టర్ వెంట ట్రైనీ కలెక్టర్ మనోజ్, తహసీల్దార్ కృష్ణ ఉన్నారు.

సమీకృత గురుకులానికి స్థలం కేటాయింపు

నారాయణఖేడ్: సిర్గాపూర్ మండలం వాసర్ శివారులో సమీకృత గురుకులానికి 25 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసిందని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి తెలిపారు. సమీకృత గురుకులాన్ని మొదటి విడతలోనే మంజూరు చేయాలని కోరుతూ తాను బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు వినతి పత్రం అందజేశానని, వెంటనే స్పందించి స్థల కేటాయింపునకు ఉత్తర్వులు ఇప్పించారని తెలిపారు. ఇందుకు వారిద్దరికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి

అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి జోన్: జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. గురువారం కలెక్టరేట్లో ఆయన మున్సిపల్ శాఖ, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ, ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్ శాఖల సమన్వయంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలోని మున్సిపల్ పరిధిలోని అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఎనిమిది మున్సిపాలిటీల పరిధిలో క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలని ఆదేశించారు.

12న మల్లన్నస్వామి ఉత్సవాలు



ఆలయంలో వెలసిన మల్లన్న స్వామి

జహీరాబాద్: జహీరాబాద్‌కు సమీపంలోని బాల్కి తాలూకా పరిధిలో గల ఖానాపురంలో ఈనెల 12వ తేదీన ప్రఖ్యాత మల్లన్నస్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాలకు కర్ణాటకతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. రాత్రి 11 గంటలకు ఆలయం నుంచి పల్లకీసేవ ప్రారంభమై గురత్ మల్లమ్మ దేవాలయం మీదుగా హనుమాన్ మందిరం వరకు కొనసాగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డొల్లు కుణిత, వాగయ్య కుణిత, కాటి కుణిత తదితర కార్యక్రమాలను జరగనున్నాయి. 13న ఉదయం 6 గంటలకు ఆలయంలో మహా మంగళహారతి, రథోత్సవం జరుగుతుందన్నారు.



భారీ బతుకమ్మ వద్ద మహిళలు

సద్దుల సంబురం

బతుకమ్మ పాటలు.. ఆడబిడ్డల ఆటలతో ఎటు చూసినా సందడే.. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఉత్సవాలలో చివరి రోజు సద్దుల బతుకమ్మను జిల్లా వ్యాప్తంగా అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొలిచారు. ఉదయం నుంచే ప్రతి ఇంట్లో మహిళలు, యువతులు బతుకమ్మను తయారు చేశారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. అనంతరం పసుపు కుంకుమలతో తయారుచేసిన గౌరమ్మను పూజించారు. వీధుల్లో ఒక చోట బతుకమ్మలను చేర్చి ఆడిపాడారు. ఊరూరు పూల వనాలను తలపించాయి. సాయంత్రం నుంచి రాత్రి వరకు బతుకమ్మలు ఆడిన తరువాత స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చి పుచ్చుకొని వెంట తెచ్చుకున్న సద్దులను ఆరగించారు. – సంగారెడ్డి జోన్



వాయినాలు ఇచ్చుకుంటున్న మహిళలు



యువతుల ఆటా పాట



బతుకమ్మను నిమజ్జనం చేస్తున్న యువతి



సంగారెడ్డిటౌన్: సంగారెడ్డి మండలం పసల్వాది గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



సంగారెడ్డి మహబూబ్ సాగర్ చెరువులో బతుకమ్మలు నిమజ్జనం చేస్తున్న మహిళలు

రైతులకు ఉపశమనం

- జిల్లాకు రూ.3.28 కోట్ల పంట నష్టపరిహారం
- రైతుల ఖాతాల్లో జమ కానున్న నిధులు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



సంగారెడ్డి జోన్: రైతులకు ప్రభుత్వం పెద్ద ఊరట కల్పించింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం విడుదల చేసింది. ట్రెజరీ ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం నిధులను విడుదల చేస్తూ జీఓను జారీ చేసింది. విడుదలైన నిధులు త్వరలో రైతుల బ్యాంకు ఖాతాలలో జమ కానున్నట్లు సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారు.

- జిల్లా వ్యాప్తంగా గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పత్తి, చెరకు, పెసర, మినుము తదితర పంటలకు నష్టం వాటిల్లింది. నష్టపోయిన పంటకు పరిహారం అందించాలని రైతులు కోరారు.
- ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాలలో వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టపోయిన పంట వివరాలు సేకరించారు.
- జిల్లావ్యాప్తంగా 3,288.34 ఎకరాలలో పంట నష్టం జరిగిందని నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు.
- ఎకరానికి రూ.10 వేల చొప్పున పంట నష్టపరిహారం అందించనుంది. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ శాఖ విడుదల చేసిన పంట నష్టాలలో జిల్లా మూడో స్థానంలో ఉంది. ఈ మేరకు జిల్లాకు రూ. 3.28 కోట్ల నిధులు విడుదల అయ్యాయి.
- జిల్లావ్యాప్తంగా 2,881 మంది రైతులను గుర్తించి, పంట నష్టపరిహారం అందించనున్నారు. నష్టపరిహారం నిధులు విడుదల కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేరుగా రైతు ఖాతాల్లో జమ



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జరిగిన పంట నష్టానికి ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అయ్యాయి. త్వరలో రైతుల ఖాతాలోనే పరిహారం జమ అవుతుంది.

–శివ ప్రసాద్,
జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, సంగారెడ్డి

అందుబాటులోకి రవాణా సేవలు

- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి
- ఖేడ్‌లో ఎంవీఐ సబ్ కార్యాలయం ప్రారంభం

నారాయణఖేడ్: నారాయణఖేడ్‌లో ఆర్టీఏ సేవలు వారానికి రెండురోజుల పాటు అందడంతో ఇక్కడి ప్రాంత వాసులకు ఎంతో మేలు జరుగుతోందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. రైతు బజార్‌లో గురువారం ఎంవీఐ సబ్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్లు, బీమా, ఫిట్‌నెస్ తదితర సేవల కోసం జహీరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. రూ.లక్షలు పెట్టి వాహనాలు కొన్నా జహీరాబాద్‌కు వెళ్లలేక చాలామంది తనిఖీల్లో ఆయా పత్రాలు లేక జరిమానాలు చెల్లించాల్సిన పరిస్థితులు ఉండేవని పేర్కొన్నారు. ఆర్టీఏ సేవలను వారంలో రెండు రోజుల పాటు ఇక్కడే అందించాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరగా.. వెంటనే స్పందించి ఉన్నతాధికారులకు ఆదేశించారని తెలిపారు. ఈ మేరకు బుధ, గురువారాల్లో ఇక్కడే ఆయా సేవలు అందిస్తారని తెలిపారు. త్వరలో ఇక్కడే శాశ్వతంగా సేవలు అందించేలా ఎంవీఐ కార్యాలయాన్ని మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ, ఎంవీఐ వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు వివేకానంద్, మాజీద్, నర్సింహులు, రామకృష్ణ, సద్దాం, హన్మాండ్లు, తాహెర్‌అలీ, నర్సింహారెడ్డి, అశోక్‌రెడ్డి వివిధ ప్రాంతాల ఎంవీఐలు పాల్గొన్నారు.



నారాయణఖేడ్‌లో ఎంవీఐ సబ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

దసరా జోష్

- కిటకిటలాడుతున్న మార్కెట్లు
- ఆఫర్లతో ఆకర్షిస్తున్న వ్యాపారులు

సదాశివపేట(సంగారెడ్డి): మార్కెట్లకు దసరా కళ వచ్చేసింది. కొనుగోలుదారులతో దుకాణాలన్నీ కిటకిటలాడుతున్నాయి. కొనుగోలుదారులను ఆకర్షించేందుకు గిఫ్ట్ ఆఫర్లు, డిస్కౌంట్లను అందిస్తున్నారు. వస్త్ర దుకాణాలు, రెడిమేడ్, కిడ్స్‌వేర్‌లలో సందడి నెలకొంది. గతంలో హైదరాబాద్, పటాన్‌చెరు, రామచంద్రపూర్ పట్టణాలకు వెళ్లి కొత్త దుస్తులు కొనుగోలు చేసేవారు. ఈసారి స్థానికంగానే బ్రాండెడ్ షోరూంలు అందుబాటులోకి రావడంతో ఇక్కడే కొనుగోలు చేస్తున్నారు. అలాగే.. అమెజాన్, ఫ్లిప్‌కార్డు, స్నాప్‌డీల్, మైత్ర, టాటా, జియో వంటి సంస్థలు ఆన్‌లైన్‌లో ప్రత్యేక ఆఫర్లను ప్రకటిస్తున్నాయి. దీంతో జిల్లావాసులు ఆన్‌లైన్ కొనుగోళ్లపై ఆసక్తి చూపుతున్నారు. ఆన్‌లైన్‌లో క్యాష్‌బ్యాక్, ఆఫర్లు, సులభ వాయిదాలతో వినియోగదారులు వివిధ వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. ప్రధానంగా దుస్తులు, మొబైల్, ఎలక్ట్రానిక్ వస్తువులు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్నారు. గతంలో పట్టణాలకే పరిమితమైన ఆన్‌లైన్ సౌకర్యం.. ప్రస్తుతం గ్రామాలకు విస్తరించింది, దీంతో ఆన్‌లైన్‌లో వస్తువుల కొనుగోళ్లు పెరిగాయి. అంతేకాకుండా నచ్చని వస్తువులను వారం రోజుల్లో తిరిగి వాపస్ చేసే అవకాశం ఉండడంతో వీటివైపే మొగ్గు చూపుతున్నారు.



కిటకిటలాడుతున్న ఓ వస్త్ర దుకాణం

విద్యకు అధిక బడ్జెట్ కేటాయించాలి

టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ డిమాండ్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: విద్యాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పదిశాతం, రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఇరవై శాతం బడ్జెట్‌ను కేటాయించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం సంగారెడ్డిలోని టీపీటీఎఫ్ భవన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకటి నుంచి మూడు తరగతులను అంగన్‌వాడీ కేంద్రాలలో కలిపే ఆలోచనను ప్రభుత్వం మానుకోవాలని, ప్రస్తుతం నడుస్తున్న ప్రాథమిక పాఠశాలలోనే పూర్వ ప్రాథమిక విద్యను బోధించాలని, అందుకు సుశిక్షితులైన ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. రాష్ట్రంలోని 17 విశ్వ విద్యాలయాలలో పూర్తి స్థాయి ఫ్యాకల్టీ నియమించడంతో పాటు పాఠశాల విద్యలో ఖాళీగా ఉన్న డీఈఓ, డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ, డైట్ లెక్చరర్స్, జూనియర్ లెక్చరర్స్ పోస్టులను భర్తీ చేసి, మానిటరింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో వస్తున్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి బదులుగా విశ్వవిద్యాలయాలను, పాలిటెక్నిక్ కళాశాలలను, ఐటీఐలను అభివృద్ధి చేసి తెలంగాణ యువతకు ఉద్యోగులు వచ్చే నైపుణ్యాలను నేర్పించాలన్నారు. కార్పొరేటీకరణ, కాషాయీకరణను ప్రోత్సహించే నూతన జాతీయ విద్య విధానం– 2020 రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకూడదని చెప్పారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్, కౌన్సిలర్ లక్ష్మయ్య యాదవ్, ఉపాధ్యక్షులు విజయ్ భాస్కర్ , కార్యదర్శి అశోక్ కుమార్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సురేష్, ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి శ్రీధర్, నాయకులు అశోక్, సిరాజ్ అహమ్మద్, ముజీబ్, మొయిజోద్దిన్ తదితరులు పాల్గొన్నారు,

పోలీసు కార్యాలయంలో ఆయుధ పూజ

సంగారెడ్డి జోన్: విజయదశమి పండుగను పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయుధపూజ నిర్వహించారు. గురువారం ఎస్పీ చెన్నూరి రూపేష్, అడిషనల్ ఎస్పీ సంజీవరావు ఆయుధాలు, వాహనాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి, శాంతిభద్రతలు, నేరాల నియంత్రణలో పోలీసుశాఖ సఫలీకృతం కావాలని దుర్గా మాతకు పూజలు చేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నరేందర్, అధికారులు పాల్గొన్నారు.

బాబోయ్ భల్లూకం

- రంజోల్ గ్రామంలో ఎలుగుబంటి సంచారం
- పాదముద్రలు సేకరించిన అటవీ అధికారులు

జహీరాబాద్: మండలంలోని రంజోల్ గ్రామంలో ఎలుగుబంటి కలకలం సృష్టించింది. దీంతో అప్రమత్తమైన అటవీ అధికారులు పాదముద్రలను సేకరించారు. గురువారం రైతు అఫ్జల్‌మియా తన వ్యవసాయ పొలానికి వెళ్లగా కొత్త రకం పాదముద్రలు కనిపించడంతో ఏఈఓ ప్రదీప్‌కుమార్‌కు సమాచారం ఇచ్చాడు. వెంటనే ఆయన అటవీ అధికారులకు తెలుపడంతో సెక్షన్ ఆఫీసర్ కృష్ణమ్మ, బీట్ ఆఫీసర్లు సంతోషి, భాస్కర్, సంజీవ్, తుకారాంలు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి పాదముద్రలు సేకరించి పరిశీలించారు. ఎలుగుబంటి పాదముద్రలుగా అనుమానిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు చేరవేస్తామన్నారు. రైతులు, రైతు కూలీలు పొలాలకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పొలాల వద్ద మంటలు వేసుకోవాలన్నారు. ఎవరికైనా కనిపిస్తే వెంటనే సమాచారం ఇస్తే బంధించేందుకు చర్యలు చేపడతామన్నారు.



వ్యవసాయ పొలంలో పాదముద్రలు పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

సత్వార్.. తీన్మార్..!

- ఒకే ఊరికి చెందిన ముగ్గురికి సర్కారీ కొలువులు

జహీరాబాద్ టౌన్: ప్రస్తుత కాలంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే ఆషామాషీ వ్యవహారం కాదు. పోస్టులు పదుల్లో ఉంటే.. దరఖాస్తులు లక్షల్లో ఉంటున్నాయి. పోటీ పరీక్షలు తీవ్రంగా ఉంటుంది. అయినా పట్టుదలతో ఒకే ఊరికి చెందిన ముగ్గురు టీచర్ కొలువు కొట్టారు. వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చిన వీరు సొంత ఊరులో ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నారు. జహీరాబాద్‌లో ఇంటర్, డీఎడ్ పూర్తి చేశారు. సర్కారు కొలువు సాధించాలన్నది వారి కల. లక్ష్యాన్ని చేరేందుకు కష్టపడ్డారు. ప్రణాళికబద్ధంగా చదివారు. ఇటీవల విడుదలైన టీజీ డీఎస్సీ ఫలితాల్లో ఎస్‌జీటీ పోస్టులకు ఎంపికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో నియామక పత్రాలు తీసుకుని మురిసిపోయారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి ముగ్గురు టీచర్ ఉద్యోగాలు సాధించడంతో ప్రధానోపాధ్యాయులు శేఖర్ వారిని అభినందించారు.

అమ్మ ఆశయం నెరవేర్చా..



మాది వ్యవసాయ కుటుంబం. మా ఇంట్లో ఇద్దరం ఆడపిల్లలమే. నాన్న చనిపోవడంతో కుటుంబ భారం అమ్మపై పడింది. అమ్మ ప్రోత్సాహంతో పదో తరగతి సత్వార్ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో చదివా. ఇంటర్, డీఎడ్ జహీరాబాద్‌లో పూర్తి చేశా. డీఎస్సీ పరీక్షల కోసం రాత్రింబవళ్లు శ్రమించా. టీచర్ ఉద్యోగం సాధించాలని లక్ష్యంతో పరీక్షలు రాసి 462 ర్యాంకు సాధించి అమ్మ ఆశయం నెరవేర్చా.

–జి.జగదేవి, సత్వార్

కష్టానికి ఫలితం దక్కింది..



మాది నిరుపేద కుటుంబం. అమ్మనాన్న అక్కా, చెల్లె ఉంది. రెండు ఎకరాల పొలం ఉండగా నాన్న కష్టపడి కుటుంబాన్ని పోషించాడు. ఎలాగైన ప్రభుత్వం ఉద్యోగం సాధించాలని దృఢ లక్ష్యంతో కష్టపడి చదివా. నిర్మల్ జిల్లాకు చెందిన మిత్రుడితో పోటీ పడ్డా. ఆన్‌లైన్ క్లాస్‌కు హాజరై 2024లో నిర్వహించిన డీఎస్సీ పరీక్ష ఫలితాల్లో 70వ ర్యాంక్ సాధించా.

–జి. ఆకాష్, సత్వార్

సత్తాచాటిన పూజారెడ్డి



డీఎస్సీ ఫలితాల్లో పూజారెడ్డి సత్తాచాటారు. సొంత ఊరు సత్వార్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివి.. ఇంటర్, డీఎడ్ జహీరాబాద్‌లో పూర్తి చేసింది. 2024లో నిర్వహించిన డీఎస్సీ పరీక్ష ఫలితాల్లో 160వ ర్యాంక్ సాధించి ఎస్‌జీటీ పోస్టుకు ఎంపికైంది. తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహంతో ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందని ఆమె పేర్కొన్నారు.

– కె పూజారెడ్డి, సత్వార్

క్లుప్తంగా

వివరాలు తెలిస్తే చెప్పండి

- ఇస్నాపూర్‌లో తప్పిపోయిన బాలిక


స్టేషన్‌లో బాలిక

పటాన్‌చెరు టౌన్ : మార్కెట్‌లో అదృశ్యమైన బాలికను పటాన్‌చెరు పోలీసులు చేరదీశారు. వారి కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ మార్కెట్‌లో గురువారం ఓ బాలిక తిరుగుతూ కనిపించింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బాలికను పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. బాలికను వివరాలు అడుగగా తన పేరు జానకి అని చెబుతుంది. మిగితా వివరాలు చెప్పకపోవడంతో పోలీసులు బాలిక తల్లిదండ్రుల కోసం వెతుకుతున్నారు. ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

శిశువు ఆచూకీ లభ్యం


శిశువును అప్పగిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

సంగారెడ్డి : సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రి నుంచి అపహరణకు గురైన చిన్నారిని సంగారెడ్డి పోలీసులు గుర్తించారు. సీసీ పుటేజీ ఆధారంగా విచారించగా హైదరాబాద్ బోరబండలో దొంగతనం చేసిన వ్యక్తులను గురువారం బేబీతో సహా చూసి పోలీసులు పట్టుకున్నారు. ఆస్పత్రి సిబ్బంది ఇవ్వగా శిశువును తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య


జమీల్(ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గురువారం ఎస్‌ఐ సుభాష్ గౌడ్ కథనం మేరకు.. మనోహరాబాద్ మండల కేంద్రానికి అబ్దుల్ జమీల్ (32) భార్యాపిల్లలతో కలిసి కీసరలో ఉంటూ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. జీతం సరిపోకపోవడం, కుమారుడి ఆరోగ్యం బాగుండక పోవడంతో ఆర్థిక సమస్యలు తలెత్తాయి. ఏం చేయాలో తోచక 4వ తేదీన మనోహరాబాద్‌కు వచ్చి తల్లి వద్ద ఉన్నాడు. 7న మద్యం తాగి ఇంటికొచ్చి వాంతులు చేసుకుంటుండగా తల్లి అడిగింది. పురుగుల మందు తాగినట్లు చెప్పడంతో కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు అబ్దుల్ ఖయ్యూం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భారీ చోరీకి యత్నం


టిప్పర్‌లో తరలిస్తున్న మిషనరీ

మనోహరాబాద్(తూప్రాన్): మూతపడిన పరిశ్రమ నుంచి భారీ మిషనరీలను టిప్పర్‌లో వేసుకొని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. గురువారం మనోహరాబాద్ ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులో గల బీఎస్ స్టీల్ పరిశ్రమ మూతపడింది. ఈ పరిశ్రమ బ్యాంకు ఆధీనంలో ఉంది. బుధవారం అర్ధరాత్రి దొంగలు మూతపడిన పరిశ్రమ నుంచి క్రేన్ సహాయంతో మిషనరీలను టిప్పర్ వాహనంలో తరలిస్తున్నారు. నమ్మదగిన సమాచారంతో మేరకు వెంబడిస్తుండగా దుండగులు మార్గమధ్యలోనే వాహనాలను వదిలిపెట్టి పరారయ్యారు. చోరీకి ఉపయోగించిన క్రేన్, మిషనరీ లోడ్‌తో ఉన్న టిప్పర్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలించాం. బ్యాంకు ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు. మండలంలోని రంగాయపల్లి, ముప్పిరెడ్డిపల్లి, కాళ్లకల్ గ్రామానికి చెందిన కొంత మంది ముఠాగా ఏర్పడి కొన్ని నెలలుగా చోరీలకు పాల్పడుతున్నారని, అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిషనరీల విలువ సుమారు రూ.20 లక్షల మేర ఉంటుందని తెలిపారు.

మహిళా శక్తి.. ఆర్థిక ప్రగతి

కొత్త పథకంతో రాష్ట్ర ప్రభుత్వం చేయూత

- ఆర్థికంగా ఎదుగుదలకు 'ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్'
- జిల్లాలోనే మొదటిసారిగా హుస్నాబాద్‌లో ప్రారంభం
- ఐదారుగురు కలిసి ఒక యూనిట్‌గా ఏర్పాటు
- రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణం
- శుచి, శుభ్రత.. రుచికరమైన వంటలు


హుస్నాబాద్ పట్టణంలో మహిళలు ఏర్పాటు చేసిన క్యాంటీన్

మహిళా సంఘాల రుణాలతో పెద్ద ఉపయోగం లేదని భావించిన రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ పథకానికి శ్రీకారం చుట్టింది. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రోత్సాహకాలను అందిస్తుంది. ఇందులో భాగంగా స్వయం శక్తితో ఉపాధి పొందుతూ ఆర్థికంగా నిలబడేందుకు మహిళలు సైతం ముందడుగు వేస్తున్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ పథకాన్ని జిల్లాలోనే మొట్టమొదటిగా హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభించారు. – హుస్నాబాద్

హుస్నాబాద్ పట్టణంలో 484 మహిళా సంఘాలు, 5,127 మంది సభ్యులు ఉన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మాకు చెందిన తేజ్ సమాఖ్యలోని శ్రీ భవానీ స్వయం సహాయక సంఘం సభ్యులకు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ నిర్వాహణ కోసం బ్యాంక్ ద్వారా రూ.11 లక్షలు మంజూరు చేసింది. మహిళా సంఘం, స్త్రీ నిధి, ముద్ర, పీఎంఈజీపీ ఇలా పలు పథకం నుంచి మహిళలు రుణం తీసుకునే అవకాశం కల్పించింది. వ్యాపార నిమిత్తం వ్యక్తిగత రుణాలు కాకుండా ఐదు నుంచి పది మంది కలిసి ఒక గ్రూపుగా ఏర్పడి ఏదైనా ఉపాధి పొందేందుకు గ్రూపును యూనిట్‌గా పరిగణలోకి తీసుకొని బ్యాంక్ ద్వారా రుణం అందిస్తున్నారు. వ్యాపారాల కోసం ఒక్కో యూనిట్‌కు రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు బ్యాంక్ రుణాలు అందిస్తారు. బ్యాంక్ నుంచి రుణం పొందిన వారు సుమారు 60 వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది.


క్యాంటీన్‌లో పచ్చళ్లు, స్నాక్స్


కూరగాయలను కోస్తున్న మహిళలు

ఆ ఐదుగురే అన్నీ..

తేజ్ సమాఖ్యలోని భవానీ గ్రూపునకు చెందిన ఐదుగురు సభ్యులకు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ కింద రూ.11లక్షల రుణం తీసుకున్నారు. ఈ నిధులతో క్యాంటీన్ నెలకొల్పడానికి ఫర్నీచర్, ఫ్లెక్సీ బోర్డులు, వంట సామగ్రి, స్టీల్ ప్లేట్స్ ఇతర వస్తువులు కొనుగోలు చేశారు. ఉదయం టీ, టిఫిన్‌తో మధ్యాహ్నం భోజనం తయారు చూస్తూ హైజెనిక్ ఫుడ్ అందిస్తూ ఉపాధి పొందుతున్నారు. గ్రూపునకు చెందిన పచ్చిమట్ల స్వప్న, టీ.ఇందిర, పీ.రేణుక, ఎం.తార, పీ.ప్రవళికలు అన్నీ తామై క్యాంటీన్‌ను నడుపున్నారు. స్నాక్స్, స్వీట్లు, పచ్చళ్లు, టిఫిన్స్, కూల్ డ్రింక్స్, బిర్యానీ, శాఖాహారం, మాంసహారం అన్ని రకాలు తయారు చేసి విక్రయిస్తున్నారు. క్యాంటీన్‌కు వచ్చే భోజన ప్రియులకు తక్కువ ధరకే ఆ ఐదుగురే వంటలు తయారు చేసి వడ్డిస్తారు. అలాగే క్యాంటీన్‌లో శుచి, శుభ్రత పాటిస్తూ భోజన ప్రియులకు రుచికరమైన భోజనం అందిస్తున్నారు.


క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న యువకులు

పలు రకాల వ్యాపారాలు

మహిళలు ఉపాధి పొందేందుకు క్యాంటీన్ కాకుండా నర్సరీ, కిరాణాషాపు, క్లాత్ స్టోర్, ఫ్యాన్సీ స్టోర్, కూరగాయలు, పండ్లు, పువ్వుల దుకాణాలు, స్టేషనరీ, రైస్, దాల్ వ్యాపారం ఇలా 24 రకాల వ్యాపారాల కోసం ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందిస్తుంది. మహిళా సంఘంలోని 5 నుంచి 10 మంది సభ్యులు కలిసి వివిధ రకాలు వ్యాపారం చేసుకునే ఆర్థికాభివృద్ధిని సాధించేందుకు ఇందిరా మహిళా శక్తి పథకాలు ఎంతగానో తోడ్పడుతాయి. ఈ క్యాంటీన్ మాత్రం ఐదుగురు మహిళా సభ్యులు నిర్వాహకులుగా వ్యవహరిస్తున్నారు.

శుభకార్యాలకు సైతం..



మాకు వంటలు చేసే అనుభవం ఉంది. స్వతహాగా వంటలు చేసి శుభకార్యాలకు భోజనాలు అందిస్తున్నాం. ఆ అనుభవంతోనే క్యాంటీన్‌ను నడిపిస్తున్నారు. క్యాంటీన్ మంజూరుకు ముందు వరంగల్, హన్మకొండలోని పెద్ద పెద్ద హోటల్‌లో వంటలు వండే విధానం చూసి వచ్చాం. క్యాంటీన్ ద్వారా తమకు ఉపాధి దొరికింది. భోజన ప్రియులకు నాణ్యమైన భోజనం అందించడంతోపాటు బయటి హోటళ్ల కంటే తక్కువ ధరలోనే అందిస్తున్నాం. నాణ్యతలో ఎక్కడా రాజీ పడబోం.

– పచ్చిమట్ల స్వరూప, హుస్నాబాద్

ఉపాధికి మంచి అవకాశం



ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి పథకం మహిళల ఉపాధికి సువర్ణావకాశం. ప్రతీ గ్రూపు యూనిట్‌కు రూ.5 నుంచి రూ.20 లక్షల వరకు బ్యాంక్ ద్వారా రుణం అందుతుంది. పప్పుల పరిశ్రమ, అల్లం, ఎల్లిగడ్డ మిషన్ కోసం రుణం ఇప్పించే ప్రయత్నం చేస్తాం. అలాగే భవన నిర్మాణాలకు సంబంధించి సెంట్రింగ్ యూనిట్ గ్రౌండింగ్ కోసం ప్రయత్నం చేస్తాం. మహిళలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలి.

– రాజు, మెప్మా సీఈఓ, హుస్నాబాద్

సరస్వతీ పుత్రికలకు హరీశ్‌రావు చేయూత

- ఒకే ఇంట్లో నలుగురు డాక్టర్లు
- వైద్య విద్యకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

సిద్దిపేటజోన్: లక్ష్యానికి పేదరికం అడ్డుకాదని నిరూపించి కష్టపడి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీట్లు సాధించిన సరస్వతీ పుత్రికలకు సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అండగా ఉన్నారు. మొదట్లో ఇద్దరికి సాయం చేసిన ఎమ్మెల్యే తాజాగా గురువారం మరో ఇద్దరికి రూ.50 వేలు ఆర్థిక సాయం అందించి వారిని ప్రోత్సహించారు. వారంతా ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అక్కాచెల్లెళ్లు కావడం విశేషం.. సిద్దిపేట పట్టణానికి చెందిన కొంక రామచంద్రం, శారద దంపతులకు నలుగురు కూతుళ్లు. వారిలో చివరి ఇద్దరు కవల పిల్లలు రోహిణీ, రోషిణీలు ఈ సంవత్సరం ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అడ్మిషన్లు పొందారు. ఈ నేపథ్యంలో పిల్లల హాస్టల్ ఖర్చుల విషయంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న హరీశ్‌రావు వారిని క్యాంపు కార్యాలయానికి పిలిపించి సాయం చేశారు. భవిష్యత్‌లో ఏ అవసరం ఉన్నా చేయూత అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మెడిసిన్ విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో కూడా వీరి మొదటి కుమార్తె మమత, రెండో కుమార్తె మాధవీలు ఎంబీబీఎస్ సీట్లు సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే ఆర్థికసాయం చేసి అండగా నిలిచారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా జిల్లాకు మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడం వల్ల పేద పిల్లలకు డాక్టర్ చదివే అవకాశం ముంగిట్లోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


తల్లిదండ్రులు, విద్యార్థులతో ఎమ్మెల్యే హరీశ్ రావు

ఘనంగా కాళీ ప్రత్యంగిరా మహాయజ్ఞం


అమ్మవారికి అభిషేకం చేస్తున్న సుమన్

వేడుకలకు హాజరైన సినీనటుడు సుమన్

వెల్దుర్తి(తూప్రాన్) : మండల పరిధి మన్నెవారి జలాల్‌పూర్ గ్రామ శివారులోని శ్రీ మహంకాళీ దేవాలయం వద్ద దేవీ శరన్నవరాత్రోత్సవ, కాళీ ప్రత్యంగిరా మహాదేవి దివ్య విశ్వశాంతి మహాయజ్ఞం (ఎండు మిరపకాయల మహాయజ్ఞం) కనుల పండువగా నిర్వహించారు. న రాయణి ప్రత్యంగిరా మహాదేవి ఉపాసకుడు శ్రీ శంకర విశ్వేశ్వర నంద స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో ప్రముఖ సినీనటుడు సుమన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌లతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు హాజరై అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. యోగబాధలు, దుష్టగ్రహ బాధలు, శత్రువుల నుంచి విముక్తి కల్పించే మహాశక్తి ఈ యాగానికి ఉందని, లోక కల్యాణార్థమై ఈ మహాయాగం నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు సత్యనారాయణ తెలిపారు. అనంతరం సినీనటుడు సుమన్ మాట్లాడుతూ.. ఈ యాగం అపూర్వమైనది, అద్భుతమైనదని అన్నారు. తాను ఒక హిందువుగా సనాతన ధర్మ పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఉత్సవాల్లో వివిధ పార్టీల నాయకులు సుహాసిని రెడ్డి, నరేందర్ రెడ్డి, మల్లేశం, మహేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ


నిరసన తెలుపుతున్న ఓ వర్గం వారు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రాజోల గ్రామంలో భూ వివాదానికి సంబంధించి ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకోగా పలువురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. గ్రామ సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు భూములకు సంబంధించి కొద్ది రోజులుగా రెండు వర్గాల మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. గురువారం ఓ వర్గానికి చెందిన వారు పొలానికి వెళ్లే దారికి రాళ్లను అడ్డం పెట్టి రాకపోకలను నిలిపివేశారు. ప్రభుత్వ భూమిలో ఎలా పెడుతారని మరో వర్గం వారు ప్రశ్నించడంతో ఘర్షణ చోటు చేసుకుంది. ఈ విషయమై రెండు వర్గాలు హద్నూర్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హద్నూర్ ఎస్‌ఐ రామానాయుడు తెలిపారు. ఓ వర్గానికి చెందిన వారు తమకు న్యాయం చేయాలంటూ న్యాల్‌కల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద అందోళన చేశారు. ప్రభుత్వ భూమిలోంచి వ్యవసాయ భూములకు వెళ్లకుండా మరో వర్గం వారు అడ్డుకుంటున్నారని, తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ భూపాల్‌కు వినతిపత్రం అందజేశారు. పండుగ తర్వాత సర్వే చేయించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

బతుకమ్మకు పూలు తేవడానికి వెళ్లి..

- రోడ్డు ప్రమాదంలో మాజీ ఉప సర్పంచ్ మృతి
- బైక్‌ను ఢీకొట్టిన కారు


వెంకటేశ్ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో మాజీ ఉప సర్పంచ్ మృతి చెందిన ఘటన కుకునూరుపల్లి మండలంలోని లక్డారం గ్రామ క్రాస్ రోడ్డు వద్ద చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ బింగి వెంకటేశ్(39) గురువారం సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా రాజీవ్ రహదారిపై ఏర్పాటు చేసిన దుకాణాల్లో పూలు తీసుకొస్తానంటూ ఇంట్లో చెప్పి బైక్‌పై వెళ్లాడు. పూలను కొనుగోలు చేసి తిరుగి రోడ్డును దాటుతుండగా కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై ఎగిరిపడి కిందపడ్డ రమేశ్ తీవ్ర గాయాలై స్పృహ కోల్పోయాడు. హుటాహుటీనా గజ్వేల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు గోదావరిఖనికి చెందిన కారు డ్రైవరు బొల్లి రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అందరితో కలుపుగోలుగా ఉండే రమేశ్ పండుగ పూట మృత చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యుదాఘాతంతో యువకుడు

చేగుంట(తూప్రాన్): విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన చేగుంటలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యకుమార్ రెడ్డి కథనం మేరకు.. సిద్దిపేట జిల్లా రాయపోల్ గ్రామానికి చెందిన గడ్డమీది అనిల్(21) చేగుంటలోని మక్కరాజీపేట రోడ్డులో పాత సామగ్రి దుకాణం నడుపుతున్నాడు. గురువారం స్నేహితుడు సమీర్‌తో కలిసి దుకాణం తెరిచి ఇనుప నిచ్చెన బయటకు తీస్తున్న క్రమంలో హైటెన్షన్ వైర్‌కు తగిలి కరెంట్ షాక్ రావడంతో ఇద్ద కిందపడిపోయారు. ఇద్దరినీ చికిత్స నిమిత్తం నార్సింగ్ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే అనిల్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తీవ్ర గాయాలైన సమీర్‌ను మెరుగైన వైద్యం కోసం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తలించారు. అనిల్ తండ్రి కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నడుచుకుంటూ వెళ్తుండగా బైక్ ఢీ..

నర్సాపూర్ : బైక్ ఢీకొని యువకుడు మృతి చెందాడు.ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి కథనం మేరకు.. శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్కల గ్రామానికి చెందిన వడ్డె సుధాకర్ (21) బుధవారం రాత్రి పని ముగించుకొని గ్రామ బస్టాప్ నుంచి కొత్త కాలనీలోని ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నా డు. అదే మార్గంలో బైక్‌పై వచ్చిన చెన్నాపూర్ గ్రామానికి చెందిన మన్నె రమేశ్ అతి వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సుధాకర్ తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. మృతుడి తండ్రి నాగయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏఎస్‌ఐ ఆత్మహత్యాయత్నంపై విచారణ


విచారణ చేస్తున్న తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ ఏఎస్‌ఐ సుధారాణి ఆత్మహత్యాయత్నంపై తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి గురువారం చిలప్‌చెడ్ పోలీస్‌స్టేషన్‌లో విచారణ చేశారు. బుధవారం రాత్రి చిలప్‌చెడ్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐ సుధారాణి ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నం చేయగా తోటి పోలీసులు గమనించి ఆస్పత్రికి తరలించిన విషయం విధితమే. ఈ విషయమై గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐతోపాటు పోలీసులను విచారణ చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. ఏఎస్‌ఐకి ప్రాణా పాయం తప్పిందన్నారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న తోటి పోలీసులను విడిగా విచారణ చేశామన్నారు. పోలీసుల అభిప్రాయాలను రాత పూర్వకంగా రాసి ఇవ్వాలన్నారు. విచారణ పూర్తి నివేదికను ఎస్పీకి అందజేయనున్నట్లు తెలిపారు. అంతకుముందు నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏఎస్‌ఐని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమలో ఎస్‌ఐ యాదగిరి పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకల్లో మంత్రి పొన్నం


ఎల్లమ్మ చెరువు వద్ద బతుకమ్మ వేడుకల్లో మహిళలతో మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు

- హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద కిక్కిరిసిన జనం
- స్వయంగా ట్రాఫిక్‌ను క్లియర్ చేసిన మంత్రి

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో ఎల్లమ్మ చెరువు కట్ట పైన వైభవంగా సద్దుల బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై మహిళలను ఆత్మీయంగా పలుకరించి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. చెరువు కట్ట వద్ద వాహనాలు కిక్కిరిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మంత్రి స్వయంగా ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అలాగే మహిళలతో కలిసి మంత్రి సతీమణి మంజుల బతుకమ్మ ఆడారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నం మాట్లాడుతూ.. పూలనే దేవతగా పూజించే గొప్ప సంస్కృతీ మనదన్నారు. దేశ, విదేశాల్లో కూడా పూల బతుకమ్మ పండుగను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు బ్యూటిఫికేషన్ కోసం ఇప్పటికే రూ.16 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ పనులు పూర్తి అయితే ఎల్లమ్మ చెరువు పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతుందని అన్నారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ఉన్నారు.

గుండె గు'బిల్లు'

మళ్లీ కరెంట్ బిల్లులతో ప్రజలు ఆందోళన

- రెండు నెలలకోసారి మీటర్ రీడింగ్
- 200 యూనిట్ల కంటే ఎక్కువ చూయిస్తున్న వైనం
- రూ.వేలల్లో బిల్లు చేతిలో పెడుతున్న అధికారులు
- అభాసుపాలవుతున్న గృహజ్యోతి పథకం



వట్‌పల్లి(అందోల్): అధికారుల నిర్లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన గృహజ్యోతి పథకం అభాసుపాలవుతోంది. 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించే వారికి ఉచిత కరెంట్ పథకాన్ని తీసుకురాగా ఈ పథకం అనుకున్న స్థాయిలో అమలు కావడం లేదు. ప్రారంభించిన నాటి నుంచి ఆరు నెలల వరకు జీరో బిల్లులు రాగా ప్రస్తుతం రూ.వేలల్లో కరెంట్ బిల్లులు రావడంపై లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు.

అందోల్ మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో విద్యుత్ అధికారులు కొన్ని ఇళ్లకు నెలనెలా విద్యుత్ బిల్లులు తీస్తున్నప్పటికీ మరికొన్ని వాటికి రెండు నెలకొకసారి తీయడంతో వేలల్లో బిల్లు వస్తుంది. దీంతో లబ్ధిదారులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రెండు నెలలకోసారి మీటర్ రీడింగ్..

విద్యుత్ అధికారులు ప్రతీ ఇంటికి నెలనెలా కరెంట్ బిల్లు కొడుతారు. 200 యూనిట్ల కంటే తక్కువ ఉన్నవారికి జీరో బిల్లు అందజేస్తారు. అంతకంటే ఎక్కువ యూనిట్లు వాడిన వారికి నగదుతో కూడిన బిల్లు అందజేస్తారు. అయితే విద్యుత్ అధికారులు గ్రామంలో నెలనెలా కాకుండా రెండు నెలలకోసారి మీటర్ రీడింగ్ తీస్తున్నారు. దీంతో 200 యూనిట్ల కంటే ఎక్కువ యూనిట్లు కరెంట్ వినియోగించినట్లు చూపిస్తుంది. ఈ క్రమంలో జీరో బిల్లులకు బదులు రూ.వేలల్లో కరెంట్ బిల్లు వస్తుంది. మరో విషయం ఏమిటంటే లబ్ధిదారులకు తెలియకుండా రెండు నెలలకు సంబంధించిన తేదీ, యూనిట్ల వివరాలు తెలుపకుండా ప్రస్తుత నెలలో వినియోగించిన యూనిట్లకు సంబంధించి విద్యుత్ బిల్లు అన్నట్లుగా అందజేస్తున్నారు. వచ్చిన బిల్లులు రూ.వేలల్లో వస్తుండడంతో లబ్ధిదారులు అవాక్కవుతున్నారు. జీరో బిల్లులకు బదులుగా రూ.వేలల్లో బిల్లులు రావడానికి అధికారులు కారణమంటూ దుమ్మెత్తి పోస్తున్నారు. బిల్లుల వసూలుకు ఎవరొస్తారో రాని వారి సంగతి చెబుతామంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


రూ.1,500 బిల్లు వచ్చింది



మొదట్లో జీరో బిల్లు వచ్చింది. మూడు నెలల పాటు కరెంట్ వాళ్లు బిల్లు తీయడానికి రాలేదు. ఆ తర్వాత ఓ వ్యక్తి వచ్చి కరెంట్ బిల్లు కొట్టగా రూ.1,500 వచ్చింది. ఈ విషయాన్ని విద్యుత్ అధికారులను అడిగితే 200 యూనిట్ల కంటే ఎక్కువ కరెంట్ వాడుకున్నారని సమాధానం ఇస్తున్నారు. ప్రతి నెలా తీయకుండా వారికి ఇష్టం వచ్చినట్లు తీయడంతో రీడింగ్ ఎక్కువగానే ఉంటుంది. వారు చేసిన తప్పుకు మేమెందుకు బిల్లులు చెల్లిస్తాం. అధికారులు దీనిపై చర్యలు తీసుకొని బిల్లులను రద్దు చేయాలి.

– వని పద్మమ్మ, కన్‌సాన్‌పల్లి

మూడు నెలలకొచ్చి రీడింగ్..



మూడు నెలల తర్వాత రీడింగ్ తీయగా రూ.3 వేలు బిల్లు వచ్చింది. వెంటనే బిల్లును చూసి రీడింగ్ తీసిన వ్యక్తిని ప్రశ్నించగా ఎక్కువ యూనిట్లు వాడుకోవడంతోనే బిల్లు వచ్చిందని చెప్పి వెళ్లిపోయాడు. గృహజ్యోతి పథకానికి ముందు గతంలో మా ఇంటికి ఒక నెల మొత్తంగా రూ.150 దాటేది కాదు. ప్రస్తుతం జీరో బిల్లు రాకపోగా రూ.వేలల్లో వస్తే ఎక్కడి నుంచి చెల్లించాలి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సీహెచ్. మల్లేశం, కన్‌సాన్‌పల్లి

నా దృష్టికి రాలేదు

ప్రతి నెలా విద్యుత్ సిబ్బందిని పంపి రీడింగ్ తీయిస్తూ 200 యూనిట్లలోపు ఉన్నవారికి జీరో బిల్లులు అందజేస్తున్నాం. రెండు, మూడు నెలలకోసారి రీడింగ్ తీయడంతో వేలల్లో బిల్లులు రావడంపై ఇప్పటి వరకు నా దృష్టికి రాలేదు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఏఈ